క్లుప్తంగా

చెట్టు కొమ్మ తొలగించండి



ద్వారకానగర్ రహదారిలో రోడ్డుపై పడిన చెట్టు కొమ్మ

సీతమ్మధార: జీవీఎంసీ 27వ వార్డులోని ద్వారకానగర్ మూడవ లైన్ ప్రధాన రహదారిలో రోడ్డుకు అడ్డంగా చెట్టు కొమ్మ పడి రాకపోకలకు ఇబ్బందిగా మారింది. రెండు రోజులు అయినప్పటికీ ఇంత వరకు దాన్ని తొలగించకపోవడంతో ట్రాఫిక్ సమస్య నెలకొంది. వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. జీవీఎంసీ అధికారులు స్పందించి చెట్టు కొమ్మ తొలగించాలని పాదచారులు, వాహన చోదకులు కోరుతున్నారు.

సమస్యల పరిష్కారానికే ప్రజాదర్బార్



లక్ష్మీ టాకీస్ ప్రజాదర్బార్‌లో వినతులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి

జగదాంబ: మంగళవారం జీవీఎంసీ 39వ వార్డు లక్ష్మీ టాకీస్ వద్ద ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ ఆధ్వర్యంలో జరిగిన ప్రజాదర్బార్‌లో ప్రజలు వినతులు సమర్పించారు. వాటి పరిష్కారానికి తక్షణమే సంబంధిత అధికారులతో ఎమ్మెల్యే మాట్లాడారు. ఈ సందర్భంగా ఉచిత ఇళ్ల స్థలాలు, కొత్త పెన్షన్లు, రేషన్ కార్డులు కావాలని కోరిన వారికి వెంటనే సంబంధిత అధికారులతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కనకమహాలక్ష్మి దేవస్థానం చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, శ్రీధర్, సౌత్ మైనార్టీ సెల్ ప్రెసిడెంట్ ముజీబ్‌ఖాన్, వివిధ కార్పొరేషన్ల డైరెక్టర్లు, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు వేళంగిణీరావు, బాబ్జి, రవి, నాగల్ల సతీష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కొత్తమ్మవారి మారువారం



కొత్తమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

అల్లిపురం: అమ్మవారి వీధి ప్రజల ఆరాధ్య దైవం కొత్తమ్మవారి మారువారం పండగ మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ఉదయం నుంచి విశేష పూజలు నిర్వహించారు. సాయంత్రం అమ్మవారిని బీజేపీ రాష్ట్ర నాయకులు నీలాపు విజయానందరెడ్డి తదితరులు దర్శించుకుని పూజలు చేశారు. మారువారం సందర్భంగా అమ్మవారి ఘటాలు గ్రామంలో తిప్పారు. అమ్మవారి తిరువీధి ఉత్సవం పలు సాంస్కృతిక కార్యక్రమాలతో వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.

ఉత్సాహంగా వేసవి విజ్ఞాన శిబిరం



ఆటల పోటీల్లో పాల్గొన్న చిన్నారులు

సింహాచలం: అడవివరం గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా మంగళవారం విద్యార్థులకు పుస్తక పఠనం, స్టోరీ టెల్లింగ్‌పై అవగాహన కల్పించారు. అలాగే పొడుపు కథలు గురించి వివరించారు. పలు ఆటల పోటీలు నిర్వహించారు. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్ గొల్లవిల్లి చైతన్య, రీడర్స్ ఫోరం కమిటీ అధ్యక్షుడు బి.బి.రాజేంద్రప్రసాద్, గ్రంథాలయాధికారి ఎస్.వి.నరసింహం పాల్గొన్నారు.

ఆంధ్ర విశ్వవిద్యాలయానికి అమృతకాలం

- జాతీయస్థాయిలో ఏయూకు అగ్రాసనం
- యువతను ఆవిష్కర్తలుగా తీర్చిదిద్దుతున్న స్టార్టప్‌లు
- పెరుగుతున్న వర్సిటీ పేటెంట్‌ల సంఖ్య



ఏయూ మెయిన్ గేట్

ఏయూక్యాంపస్ : ఆంధ్ర విశ్వవిద్యాలయం శతాబ్ది ఉత్సవాలకు చేరువవుతోంది. వ్యవస్థాపక ఉపకులపతి కట్టమంచి రామలింగారెడ్డి, సర్వేపల్లి రాధాకృష్ణన్ వంటి దార్శనికులు వేసిన బలమైన పునాదులపై నిర్మితమైన విశ్వవిద్యాలయం నేడు మరింత ఉన్నత శిఖరాలను చేరుకుంటోంది. నాలుగేళ్లుగా జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలు వర్సిటీకి అమృతకాలంగా చెప్పవచ్చు.

ఆవిష్కర్తలుగా నిలిపే 'ఆ హబ్'

నాలుగేళ్ల కిందట ఉపకులపతిగా బాధ్యతలు చేపట్టిన వెంటనే ఏయూలో స్టార్టప్, ఇంక్యుబేషన్ సెంటర్ ఏర్పాటు చేయాలని వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి సంకల్పించారు. రాష్ట్ర ప్రభుత్వ విశ్వవిద్యాలయాల్లో ఎక్కడా లేని విధంగా స్టార్టప్, ఇంక్యుబేషన్ సెంటర్ 'ఆ హబ్'కి ప్రాణం పోశారు. ఇందుకోసం ప్రత్యేకంగా ఓ సీఈవోను నియమించి.. నేడు వందకు పైగా అంకుర సంస్థలు, 500 మందికి పైగా యువత పని చేసేలా తీర్చిదిద్దారు. దీనికి చేరువలో రూ.22 కోట్ల వ్యయంతో కేంద్ర ప్రభుత్వ సాయంతో నాస్కామ్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌ను ప్రారంభించి, మరిన్ని స్టార్టప్‌లకు ఊతం అందించారు.

జాతీయ స్థాయిలో అత్యుత్తమ ర్యాంక్

కేంద్ర మంత్రిత్వ శాఖ అందించే ఎన్‌ఐఆర్‌ఎఫ్ ర్యాంకింగ్‌లో 43వ స్థానం సాధించింది. ఇటీవల ది వీక్–హన్స్ సర్వేలో జాతీయ స్థాయిలో మల్టీ డిసిప్లినరీ విశ్వవిద్యాలయాల విభాగంలో ఏయూ 9వ స్థానాన్ని సాధించింది. అఖిల భారత స్థాయిలో టాప్ 10లో ఏయూ నిలవాలన్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆకాంక్షను సాకారం చేసే దిశగా ఏయూ పని చేస్తోంది.

చెయిర్ ప్రొఫెసర్.. ప్రొఫెసర్ ఆన్ ప్రాక్టీస్

యూజీసీ ప్రారంభించే ప్రతి పథకాన్ని పూర్తిస్థాయిలో అమలు చేయడంలో ఏయూ ముందుంటోంది. ఎన్‌ఈపీ 2020ను కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన వెంటనే శతశాతం అమలు చేసిన రాష్ట్ర ప్రభుత్వం నిబద్ధతకు మరింత బలాన్ని అందించే విధంగా ఏయూ పని చేస్తోంది. రాష్ట్ర ప్రభుత్వ విశ్వవిద్యాలయాల్లో ఎక్కడా లేనన్ని చెయిర్ ప్రొఫెసర్లను ఏయూ ఇప్పటికే సాధించింది. అఖిల భారత స్థాయిలో అడుగిడిన తొలి సంవత్సరమే ఇన్‌స్టిట్యూషన్స్ ఇన్నోవేషన్ కౌన్సిల్‌లో 4 స్టార్ ర్యాంకింగ్ సాధించింది.

పేటెంట్‌ల ప్రవాహం

ఏయూలో రెండేళ్ల కిందట ఏర్పాటైన ఐపీఆర్ చెయిర్ ఎంతో ప్రభావవంతంగా పని చేస్తోంది. ఇప్పటికే 70కి పైగా పేటెంట్‌లను వర్సిటీ నుంచి దాఖలు చేయడం, పదుల సంఖ్యలో పేటెంట్‌లు సాధించడం చకచకా జరిగిపోయింది.

నాడు–నేడుతో భవనాలకు పూర్వ వైభవం

రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిన నాడు–నేడు పథకం స్ఫూర్తితో వర్సిటీలో భవనాలు, హాస్టళ్లు పూర్తిస్థాయిలో తమ స్వరూపాన్ని మార్చుకున్నాయి. దశాబ్దాలుగా నిర్లక్ష్యానికి గురైన హాస్టల్ భవనాలు పూర్తిస్థాయిలో మరమ్మతులు పూర్తి చేసుకున్నాయి. సీఎస్సార్ నిధులతో అభివృద్ధి చేసిన మౌలిక వసతులు, మైదానాలు వర్సిటీకి అతిపెద్ద వనరుగా నిలుస్తున్నాయి. అన్యాక్రాంతమైన వందలాది కోట్లు విలువైన భూములను స్వాధీనం చేసుకోవడంలో అధికారుల చిత్తశుద్ధి సైతం విశాఖ ప్రజల అభిమానాన్ని చూరగొంది.

ఉపాధి అవకాశాల వెల్లువ

వర్సిటీలో ఇప్పటికే ఇంజినీరింగ్, సైన్స్, ఆర్ట్స్, న్యాయ, ఫార్మసీ విభాగాలకు చెందిన మూడు వేల మందికి పైగా విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు కల్పించింది. ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థిని ఈశ్వరీ ప్రియ రూ.84.5 లక్షల వార్షిక వేతనంతో ఉద్యోగం సాధించి, రికార్డ్ సృష్టించింది.

కేజీహెచ్ సూపరింటెండెంట్‌కు సత్కారం



కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ శివానంద్‌ను సన్మానిస్తున్న యూనియన్ నాయకులు



డాక్టర్ శివానంద్‌ను అభినందిస్తున్న నర్సుల సంఘం నాయకురాళ్లు

మహారాణిపేట: కేజీహెచ్ వైఎస్సార్ టీయూసీ యూనియన్, ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు నీలపు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో కింగ్ జార్జి ఆస్పత్రి నూతన సూపరింటెండెంట్ డాక్టర్ శివానందను సన్మానించారు. ఒక దళిత బిడ్డ కేజీహెచ్ సూపరింటెండెంట్ కావడం ఆనందంగా ఉందన్నారు. కేజీహెచ్ అభివృద్ధికి, ఉద్యోగుల సంక్షేమానికి ఆయన పాటు పడతారని యూనియన్ నాయకులు ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు వి. లక్ష్మణ, నాయకులు రమణ, పి. వెంకట్రావు, ఎస్. రాజారావు, సీహెచ్ లీలాకృష్ణ, బి. పార్వతి, ఎస్.కె. బేగం, డి. రాజేశ్వరి, జి. అప్పారావు, సెక్రటరీ కె. రామారావు, నూకరాజు, యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

నర్సుల అభినందన

కేజీహెచ్ నూతన సూపరింటెండెంట్ డాక్టర్ పి.శివానంద్‌ను ప్రభుత్వ నర్సుల సంఘం నాయకురాళ్లు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. డి.లక్ష్మి, పిట్ల వరలక్ష్మి, పి.ప్రశాంతి, వి.ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.

హిల్‌క్రెస్ట్ బంగ్లాను రక్షించండి



ధర్నా చేస్తున్న సీబీసీఎన్‌సీ ఆస్తుల పరిరక్షణ సమితి సభ్యులు

సీతమ్మధార: సిరిపురం జంక్షన్‌లో ఉన్న సీబీసీఎన్‌సీ హిల్‌క్రెస్ట్ బంగ్లాను దురాక్రమణదారుల నుంచి రక్షించాలని సీబీసీఎన్‌సీ ఆస్తుల పరిరక్షణ సమితి కన్వీనర్ సంఘమిత్రో డాక్టర్ ఆర్ఎస్ జాన్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళ వారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద ధర్నా చేశారు. తమ సంస్థ ఆస్తులను ప్రభుత్వం రక్షించాలని ముక్త కంఠంతో నినానించారు. నిర్మాణ పనులు ప్రారంభించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. కలెక్టర్, పోలీస్ కమిషనర్, జీవీఎంసీ కమిషనర్ సంస్థ ఆస్తుల పరిరక్షణకు తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఏ పాల్, రంజిత్, ఒఫిర్, శ్యాంపాల్, జి.విజయరాజు, డాక్టర్ గెరా హనోక్, కె.మార్టిన్ తదితరులు పాల్గొన్నారు.

రూ.24 లక్షలతో అభివృద్ధి పనులకు శ్రీకారం



అభివృద్ధి పనులకు భూమిపూజ చేస్తున్న కార్పొరేటర్ మేరీజోన్స్

డాబాగార్డెన్స్: జీవీఎంసీ 36వ వార్డులో రూ.24 లక్షలతో వార్డు అభివృద్ధి పనులకు ఆ వార్డు కార్పొరేటర్, జీవీఎంసీ స్థాయీ సంఘం సభ్యురాలు మేరీజోన్స్ వార్డు అధ్యక్షుడు మాసిపోగు రాజు, స్థానిక నాయకులతో కలిసి మంగళవారం భూమి పూజ చేసి శ్రీకారం చుట్టారు. వార్డు పరిధి రెల్లివీధిలో గల డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కల్యాణ మండపాన్ని రూ.17 లక్షలతో మరమ్మతులు, పెయింటింగ్ కోసం, అలాగే వార్డు పరిధి గొడారిగోతుల్లో గల సామాజిక భవనం రూ.7 లక్షలతో మరమ్మతులు, పెయింటింగ్ పనులు చేపట్టేందుకు నిర్ణయించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 36వ వార్డులో ఒకేసారి అభివృద్ధి పనులకు రూ.కోటీ 42 లక్షలు మంజూరు చేయించి వార్డును అభివృద్ధిపథంలో నడిపించేందుకు కృషి చేస్తున్నట్టు తెలిపారు. నగర మేయర్ గొలగాని హరి వెంకటకుమారి చేతుల మీదుగా వార్డు పరిధి రంగిరీజువీధిలో రూ.58 లక్షలతో రంగిరీజువీధి అరుంధతి సేవా సమాజం జీ+2 తరహాలో కమ్యూనిటీ భవనం ఏర్పాటుకు, అందులో ఫస్ట్‌ఫ్లోర్‌లో మహిళలకు కుట్టు శిక్షణ కేంద్రం, సెకండ్ ఫ్లోర్‌లో స్థానికులు శుభకార్యాలు నిర్వహించేందుకు, అలాగే రూ.36 లక్షలతో రంగిరీజువీధిలో సీసీ రోడ్లు, డ్రెయిన్లు, రూ.24 లక్షలతో బాబాజీకొండపై సీసీ రోడ్లు, డ్రెయిన్లు, రూ.11 లక్షలతో శాలీలదిబ్బ ఎంట్రన్స్ ఆర్చి, రూ.13 లక్షలతో శాలీలదిబ్బలో పలు పనులకు భూమిపూజ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో రమణమ్మ, రమణి, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ముంపు ప్రాంతాలను ముందుగా గుర్తించాలి



మాట్లాడుతున్న ఆర్డీవో హుస్సేన్ సాహెబ్

మహారాణిపేట: రాబోయే వర్షా కాలంలో వరద నిర్వహణకు లోతట్టు ప్రాంతాలు, ముంపు ప్రాంతాలను ముందుగా గుర్తించాలని విశాఖ రెవెన్యూ డివిజనల్ అధికారి (ఆర్డీవో) డి. హుస్సేన్‌సాహెబ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం సాయంత్రం తన ఛాంబర్లో 2023 నైరుతి–పశ్చిమ రుతుపవనాల నేపథ్యంలో తీసుకోవలసిన చర్యలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల తహసీల్దార్లచే మండల స్థాయిలో ఎంపీడీవోలు, ఎలక్ట్రికల్, మెడికల్, మున్సిపల్, వ్యవసాయం, పశుసంవర్ధక, అగ్నిమాపక, టెలికమ్యూనికేషన్ తదితర శాఖల సమన్వయంతో సమావేశం నిర్వహించాలన్నారు. తుపాను షెల్టర్ల పరిస్థితిని పరిశీలించి మరమ్మతులుంటే వెంటనే సరి చేయాలని ఆదేశించారు. జిల్లాలో సంబంధిత ప్రదేశాల్లో తగినంత మందుల నిల్వలు అందుబాటులో ఉండేలా చూడాలని వైద్య శాఖ అధికారులకు తెలిపారు. మండల స్థాయిలో రెవెన్యూ, పోలీసు, వైద్య, అగ్నిమాపక, రోడ్లు – భవనాలు, ఇతర శాఖలకు సంబంధించిన అధికారుల సమన్వయంతో మాక్‌డ్రిల్ నిర్వహించాలన్నారు. జీవీఎంసీ పరిధిలో శిథిలావస్థకు చేరిన భవనాలను గుర్తించి, తగు చర్యలు చేపట్టాల్సిందిగా ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో కార్యాలయ ఏఓ మనోరంజిని, మెడికల్, జీవీఎంసీ, పోలీస్ శాఖ అధికారులు, తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

చిత్రకారిణికి జీవీఎల్ అభినందన



భువనేశ్వరిని అభినందిస్తున్న ఎంపీ జీవీఎల్

మహారాణిపేట: భారత ప్రధాని మోదీ విద్యార్థుల్లో దాగిన నైపుణ్యాన్ని వెలికి తీసి ప్రోత్సహించడానికి దేశంలోని అన్ని ముఖ్య నగరాల్లో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్లను ప్రారంభించారని రాజ్యసభ సభ్యుడు జీవీఎల్ నరసింహారావు అన్నారు. మంగళవారం మహారాణిపేట ప్రకృతి చికిత్సాలయం ఆవరణలో వర్ధమాన చిత్రకారిణి కె. భువనేశ్వరిని అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిత్రకారులు, కళాకారులను ప్రోత్సహించడం భారతీయ ప్రాచీన సంస్కృతిలో భాగం అన్నారు. ఆకాష్ ఇనిస్టిట్యూట్‌లో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం చదువుతున్న భువనేశ్వరి ఫొటో చూసి 30 నిమిషాల్లో తన బొమ్మ గీసి కానుకగా ఇవ్వడంతో జీవీఎల్ అమెను అభినందించారు. వర్ధమాన చిత్రకారులను తల్లిదండ్రులు, అధ్యాపకులు ప్రోత్సహించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ ఆంధ్రప్రదేశ్ వైద్య విభాగం కన్వీనర్ రూపాకుల రవికుమార్, ఒ. సత్తిబాబు, వంశీ, సుబ్రహ్మణ్యం, ప్రసాదరాజు, గేదెల శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

రహదారి నిర్మాణంలో నాణ్యత పాటించాలి



రోడ్డు నిర్మాణాన్ని పరిశీలిస్తున్న వార్డు వైఎస్సార్‌సీపీ నాయకులు

కంచరపాలెం: జ్ఞానాపురంలో బీటీ రోడ్డు నిర్మాణ పనులను వార్డు కార్పొరేటర్ కోడిగుడ్ల పూర్ణిమ నేతృత్వంలో మంగళవారం వైఎస్సార్‌సీపీ వార్డు సీనియర్ నాయకుడు శ్రీధర్ పర్యవేక్షించారు. జోన్–5 ఇంజినీరింగ్ విభాగాధికారులతో మాట్లాడారు. రాజీ పడకుండా పనులు చేయాలని, 20 ఎంఎం మందం ఉండేలా చూడాలని, వర్క్ ఆర్డర్లో ఇచ్చిన ప్రమాణాలకు తగ్గట్టుగా మెటీరియల్ ఉండాలని ఆదేశించారు. వార్డులో జరుగుతున్న అభివృద్ధి పనులపై కార్పొరేటర్ కోడిగుడ్ల పూర్ణిమకు సమాచారం ఇవ్వకపోవడంతో అధికారులపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఇంజినీరింగ్ డీఈ భరత్‌కుమార్, వర్క్ ఇన్‌స్పెక్టర్ గంగాధర్, వార్డు వైఎస్సార్‌సీపీ నాయకులు వేళంగిణి, శ్యామ్‌సుందర్, కల్యాణ్, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్యస్వామికి విశేష అభిషేకాలు



సింహాచలం: అడవివరం దరి విజినిగిరిపాలెంలోని ఉమాచంద్రమౌళీశ్వరస్వామి ఆలయంలోని వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి మంగళవారం అభిషేకాలు, పూజలు విశేషంగా జరిగాయి. భక్తులు అధిక సంఖ్యలో కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఆలయ అర్చకులు ద్వాదశి సోదరులు, ఉదయ్ కృష్ణశర్మ పూజలు నిర్వహించారు

60 శాతం సబ్సిడీతో లబ్ధిదారుడికి వాహనం అందజేత



లబ్ధిదారుడు లక్ష్మణరావుకు వాహన తాళం అందజేస్తున్న జేసీ విశ్వనాథన్

మహారాణిపేట: ప్రధాన మంత్రి మత్స్య సంపద యోజన పథకం కింద వెనిగాల లక్ష్మణరావుకు 60 శాతం సబ్సిడీతో నాలుగు చక్రాల వాహనాన్ని మత్స్యశాఖ మంజూరు చేసింది. మంగళవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం ఆవరణలో లబ్ధిదారుడు వెనిగాల లక్ష్మణరావుకు వాహన తాళాన్ని జిల్లా జాయింట్ కలెక్టర్ విశ్వనాథన్ అందజేశారు. నాలుగు చక్రాల వాహనం మొత్తం రూ. 12 లక్షల 12 వేల 507 రూపాయలు. దీనికి గాను 60 శాతం సబ్సిడీ అంటే రూ.7 లక్షల 27 వేల 504 రూపాయలు. దీనిలో 40 శాతం అంటే రూ.4 లక్షల 85 వేల మూడు రూపాయలు లబ్ధిదారుడి వాటాగా నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో మత్స్యశాఖ సంయుక్త సంచాలకులు జి.విజయ, సహాయ సంచాలకులు ఎం.విజయకృష్ణ, భీమిలి మత్స్యశాఖ అభివృద్ధి అధికారి డి.లావణ్య తదితరులు పాల్గొన్నారు.

క్షతగాత్రులకు అండగా ఎమ్మెల్యే వాసుపల్లి



బాధితులను పరామర్శించి ఆర్థిక సాయం అందజేస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి

డాబాగార్డెన్స్: ఒడిశా రైలు ప్రమాదంలో గాయపడ్డ వారి ఇంటికి ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ మంగళవారం వెళ్లి పరామర్శించారు. 37వ వార్డు జబ్బర తోటకు చెందిన గుండ్లు రాజారావు, సూరిశీన శ్రీనివాస్, చింతపల్లి రాజు, కురమణ వెంకటరమణ, 39వ వార్డుకి చెందిన మడ్డు సత్యం కుటుంబ సభ్యులు, స్నేహితులు కలిసి కాశీ యాత్ర, కోల్‌కతాలో దైవ దర్శనాలు ముగించుకొని తిరుగు ప్రయాణంలో విశాఖ వస్తున్న తరుణంలో ఒడిశా వద్ద జరిగిన కోరమండల్ రైలు ప్రమాదంలో గాయపడ్డారు. వారి ఇళ్లకు ఎమ్మెల్యే వెళ్లి పరామర్శించి సొంత నిధుల నుంచి రూ.15 వేల ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేతో పాటు రెల్లి కుల కార్పొరేషన్ చైర్మన్ వడ్డాది మధుసూదనరావు, వార్డు అధ్యక్షుడు నొల్లు పోతుస్వామి, శ్రీకనకమహాలక్ష్మీ దేవస్థానం ట్రస్ట్‌బోర్డు సభ్యుడు మీసాల అశోక్‌కుమార్, కాసారపు వాసు, చింతకాయల వాసు, రామరాజు, శ్రావణ్, ధనరాజు, అచ్యుత్, పార్టీ నాయకులు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు పాల్గొన్నారు.

అతిసార నియంత్రణ పక్షోత్సవాల పోస్టర్ విడుదల



పోస్టర్ ఆవిష్కరిస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు

మహారాణిపేట: జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి కార్యాలయంలో మంగళవారం ఉధృత అతిసార నియంత్రణ పక్షోత్సవాల గోడ పత్రికను ఆవిష్కరించారు. ఈనెల 5 నుంచి ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు తెలిపారు. 17 వరకు ఈ కార్యక్రమాలు కొనసాగుతాయని అన్నారు. వేసవి మొదలుకుని వర్షాకాలం వరకు అతిసార బారిన పడే ప్రమాదమున్నందున అప్పుడే పుట్టిన బిడ్డ నుంచి 5 సంవత్సరాల వయసు పిల్లలున్న ప్రతి ఇంటికి ఆశ కార్యకర్తలు, ఏఎన్ఎం వెళ్లి జింక్ మాత్రలు సరఫరా చేస్తారని తెలిపారు. జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ ఎస్.జీవన్‌రాణి మాట్లాడుతూ ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, పట్టణ ఆరోగ్య కేంద్రం, సచివాలయాలు, వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లు, అంగన్‌వాడీ కేంద్రాలలో ఓఆర్ఎస్, జింక్ కార్నర్స్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ గోడపత్రిక అన్ని ఆరోగ్య కేంద్రాలలో ప్రదర్శించాలన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా ఆరోగ్య అధికారి డాక్టర్ బి.ఉమావతి, జిల్లా మీడియా విస్తరణ అధికారి బి.నాగేశ్వరరావు, వివిధ విభాగాల అధికారులు బి.జ్యోతి, ధర్మేంద్ర, మురళీకృష్ణ, శశిభూషణ్, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన



అష్టదళ పద్మారాధనలో సిరులతల్లి

డాబాగార్డెన్స్: నగరంలోని బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి దేవస్థానంలో మంగళవారం 108 స్వర్ణపుష్పాలతో అష్టదళ పద్మారాధన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో కె. శిరీష, ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

8న సహస్ర తులసిపూజ

కనకమహాలక్ష్మి దేవస్థానంలో ఈ నెల 8న సహస్ర తులసిపూజ నిర్వహించనున్నామని ఈవో శిరీష తెలిపారు. ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలిచే భక్తులు పూజా రుసుం రూ.1500 చెల్లించి దంపతులు ఈ పూజలో పాల్గొనవచ్చని ఈవో పేర్కొన్నారు.

వలంటీర్లకు సత్కారం



వలంటీర్లను సత్కరిస్తున్న నారాయణరావు, శివప్రసాద్

మహారాణిపేట: జీవీఎంసీ 29వ వార్డులో 6 సచివాలయాలకు సంబంధించి సుమారు 70 మందికి పైగా వలంటీర్లను సేవా వజ్రా, సేవా రత్న, సేవా మిత్రా పురస్కారాలతో సత్కరించారు. వార్డు కార్పొరేటర్ వురికిటి నారాయణరావు, జోన్–4 కమిషనర్ శివప్రసాద్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ నారాయణరావు మాట్లాడుతూ దేశంలోనే మొట్టమొదటి సారిగా వలంటీర్ వ్యవస్థ అమల్లోకి తీసుకొచ్చిన ఘనత ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డికి దక్కుతుందన్నారు. ప్రజల వద్దకు సంక్షేమ పథకాలను అందిస్తున్న ఘనత వలంటీర్లకు దక్కుతుందన్నారు. సంక్షేమమే పరమావధిగా పరిపాలన సాగిస్తున్న సీఎం జగన్ 30 ఏళ్ల పాటు అధికారంలో ఉండాలని ప్రజలు కోరుకుంటున్నారని అన్నారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి జోనల్ 4 కమిషనర్ శివప్రసాద్ మాట్లాడుతూ వలంటీర్ల సేవలు అభినందనీయం అన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది, ఆర్పీలు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరానికి అనూహ్య స్పందన



రక్తదానం చేస్తున్న మెగాస్టార్ చిరంజీవి అభిమానులు

మహారాణిపేట: రైలు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న బాధితుల కోసం జిల్లా పరిషత్ వద్ద గల రెడ్ క్రాస్ సొసైటీలో మెగా రక్తదాన శిబిరం మంగళవారం జరిగింది. మెగాస్టార్ చిరంజీవి పిలుపు మేరకు సిద్ధార్థ్‌రాయ్ చిత్రం ద్వారా హీరోగా పరిచయం కాబోతున్న వర్ధమాన హీరో దీపక్ సరోజ్ రక్తదానంలో పాల్గొన్నారు. బాల నటుడిగా ఎన్నో చిత్రాల్లో నటించిన దీపక్ సరోజ్ చిరంజీవిపై గల అభిమానంతో రెడ్ క్రాస్ సొసైటీ వద్ద రక్తదాన శిబిరం నిర్వహించారు. భారీ ఎత్తున మెగా అభిమానులు శిబిరానికి హాజరై స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. దాతల నుంచి రెడ్ క్రాస్ సొసైటీ వైద్య బృందం రక్తాన్ని సేకరించింది. ఈ సందర్భంగా వర్ధమాన హీరో దీపక్ సరోజ్ మాట్లాడుతూ మెగా రక్తదాన శిబిరానికి భారీ సంఖ్యలో రక్తదాతలు రావడం పట్ల ఆనందం వ్యక్తం చేశారు. మెగా అభిమానుల నుండి ఊహించిన దాని కంటే గొప్ప స్పందన వచ్చిందన్నారు. వచ్చిన దాతలందరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఈ శిబిరంలో సుమారు 270 మంది రక్తదానం చేసినట్టు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో చిరంజీవి ఫ్యాన్స్ అసోసియేషన్ నాయకుడు యల్లాజీరావు, కొయిరాల శ్రీనివాస్‌రావు, నరసింగరావు, సందీప్, శశికళ, సంధ్య, వైదేహి, ప్రవీణ్, రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ శివనాగేంద్రరెడ్డి, సెక్రటరీ రవికుమార్, ఎస్‌కేఎల్ రావు, మెడికల్ ఆఫీసర్ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

డ్రైవర్ల సమస్యలు పరిష్కరించాలి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న క్యాబ్ ఓనర్స్ అండ్ డ్రైవర్స్ యూనియన్ నాయకులు

సీతమ్మధార: ఓలా, ఉబర్ డ్రైవర్ల సమస్యలు వెంటనే పరిష్కరించాలని విశాఖ క్యాబ్ ఓనర్స్ అండ్ డ్రైవర్స్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో మంగళవారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ గౌరవ అధ్యక్షుడు బి.జగన్ మాట్లాడుతూ ఓలా, ఉబర్ గూగుల్ యాప్ డెవలప్ చేసి డ్రైవర్లను లింక్ చేసుకుంటున్నారని అన్నారు. ఓలా, ఉబర్‌లో తిరిగే కార్లన్నీ డ్రైవర్లవేనని తెలిపారు. పెట్టుబడి, ఫైనాన్స్, డీజిల్, ఇన్సూరెన్స్ అన్నీ డ్రైవర్లే పెట్టుకుంటారని అన్నారు. ఓలా, ఉబర్‌కి లింక్ అవ్వడం వల్ల 30 శాతం వరకు కమిషన్ తీసుకుంటున్నారని తెలిపారు. ఇది చట్టరీత్యా నేరమన్నారు. కలెక్టర్, డిప్యూటీ ట్రాన్స్‌పోర్టు కమిషనర్‌కి పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదన్నారు. 20 శాతం కమీషన్ తీసుకోవాలని కోరారు. పెట్రోల్, డీజిల్ ధరలకు అనుగుణంగా కిలోమీటరు రేటు పెంచాలన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి పి.శ్రీరాములు, కమిటీ మెంబర్లు లక్ష్మీనారాయణ, ఆనంద్, పోలినాయుడు తదితరులు పాల్గొన్నారు.